# తల్లిదండ్రులను గౌరవించండి, ప్రేమించండి, సేవించండి!

*దాదాపు రెండు దశాబ్దాల తరువాత మళ్ళీ ఈ సంవత్సరం మే 6వ తేదీన మాతృశ్రీ ఈశ్వరమ్మగారి వర్ధంతి దినోత్సవం ప్రశాంతి నిలయంలో శ్రీ సత్యసాయీశ్వరుని ప్రత్యక్ష సన్నిధిలో జరగడం విశేషం. 2008 ఏప్రిల్ 26న బృందావనానికి వెళ్లిన భగవాన్ మే 2వ తేదీన ప్రశాంతి నిలయానికి తిరిగి వచ్చారు. ఈశ్వరమ్మగారి సంస్మరణ దినోత్సవాన్ని స్వయంగా దగ్గరుండి జరిపించడానికే తాము వచ్చినట్లు మే 6వ తేదీ సాయంత్రం అనుగ్రహించిన తమ దివ్యోపన్యాసంలో పేర్కొన్నారు. శ్రీవారి ప్రసంగమునకు ముందు శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయ పూర్వ వైస్ ఛాన్సలర్ డా॥ జి. వెంకట్రామన్ ఉపన్యసించారు. వారు భగవాన్ పూర్వోపన్యాసాలనుంచి ఉటంకిస్తూ కన్నతల్లినీ, మాతృభాషనీ, మాతృదేశాన్ని ఎన్నడూ మరువకూడదనీ, స్వామిని ఆదర్శంగా తీసికొని మన తల్లిదండ్రులను సంతోషపెట్టాలని చెప్పారు. ఆ తరువాత భగవాన్ తమ దివ్య సందేశాన్ని అనుగ్రహించారు (పూర్తి పాఠం ఈక్రింద ఇవ్వబడినది)*

**విద్యార్థులారా! విద్యార్థినులారా!** ఈనాటి విషయం మీకు వెంకట్రామన్ చక్కగా బోధించాడు. ఇతను చాలా గొప్ప విద్యావంతుడు, సైంటిస్టుగా గొప్ప అవార్డులు పొందినవాడు. ఇప్పుడు నేను ఈ దేహముయొక్క తల్లి విషయము ఏమని చెప్పగలను? భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక దేహములు మూడింటితో కూడినటువంటి వాడు, మానవుడు. దీనిని పురస్కరించుకొనియే నీవు ఒక్క వ్యక్తివి కాదు, నీలో ముగ్గురున్నారు అని చెబుతుంటాను. 1. The one you think you are (నీవనుకొనే నీవు – భౌతిక దేహము). 2. The one others think you are (ఇతరులనుకొనే నీవు – మనస్సు). 3. The one

sri sathyasai vachanamrutam

you really are (అసలైన నీవు – ఆత్మ).

ఈనాడు తల్లులను గౌరవించేవారు చాలా తక్కువగా ఉన్నారు. నవ మాసములు మోసి, అనేక కష్ట నష్టములను అనుభవించి, నిన్ను కన్నటువంటిది నీ తల్లి. అట్టి తల్లిని నీవు మరచిపోతే దైవాన్నే మరచినట్లవుతుంది; నిన్ను నీవే మరచినట్లవుతుంది. మొట్టమొదట మనం గౌరవించవలసినది తల్లినే. నీకు మొట్టమొదటి గురువు తల్లియే. నిన్ను పోషించినది తల్లియే. పుట్టినప్పటినుంచి నీవు నీ తల్లి ఒడియందే పెరిగి, అన్నివిధాలుగా ఆనందాన్ని అనుభవించావు. కాబట్టి, తల్లిప్రేమను నీవు మరువరాదు. తల్లిని ఎప్పుడూ మరచిపోకుండా నీ హృదయమునందే పెట్టుకోవాలి. నీవు తల్లియొక్క హృదయమునుండియే ఉద్భవించినటువంటివాడవు. తల్లి నీ హృదయమునందే ఉన్నది. కనుక, ఆమె నిన్ను వదలడానికి వీల్లేదు, నీవు ఆమెను వదలడానికి వీల్లేదు. ఎప్పటికికూడను తల్లీ బిడ్డలు ఏకంగానే ఉంటారు.

శంకరాచార్యులవారు తన తల్లి మరణించినప్పుడు ఆమెకు అంత్యక్రియలు చేయటానికి పూనుకొన్నారు. సన్న్యాసి అయినవాడు కర్మకాండలో ప్రవేశించడం ధర్మవిరుద్ధమని భావించి, ఆయన తల్లి మృతదేహాన్ని స్మశానానికి తీసికొని పోవడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. "తాను ఇంత గొప్ప పండితుడై ఉండికూడను ఈవిధమైన అనాచారమునకు పూనుకొన్నాడు", అని అనేకమంది విమర్శించారు. శాస్త్ర పాండిత్యము గొప్పది కాదు, సంస్కారము గొప్పది. అప్పుడు శంకరులవారు, "నా తల్లి నన్ను వదలడానికి వీల్లేదు. నేను నా తల్లిని వదలడానికి వీల్లేదు. దేహములు వేరువేరుగాని, ఆత్మతత్త్వం ఒక్కటే. మీరు ఎవరైనా నాకు దూరం కావచ్చునుకాని, తల్లిని దూరం చేయటానికి మాత్రం ఎవ్వరికీ అధికారం లేదు" అని అన్నారు. అందువల్లనే ఇంటి పెరట్లోనే తన తల్లికి అంతిమ సంస్కారం చేశారు. అంతటి గొప్పవారైన శంకరులవారే ఈ కార్యమునకు పూనుకొన్నారు కనుక, తాముకూడను అదేవిధముగనే చేయాలని భావించి ఈనాడు కేరళలో అనేకమంది తల్లి పోతే తమ కాంపౌండులోనే పూడుస్తున్నారు.

**'తల్లి' అని పిలుస్తూ వచ్చిన ఆ దేహం పోయిందికాని, తల్లి నాదగ్గరనే ఉంది**

sri sathyasai vachanamrutam

తల్లి దేహము మనకు దూరమైనప్పటికీ ఆమెపట్ల మన ప్రేమ ఏమాత్రం మార్పులేకుండా ఉండాలి. 1972 మే నెలలో బృందావనంలో సమ్మర్ కోర్సు జరుగుతున్నది. ఒకరోజు ఉదయం ఈశ్వరమ్మ టిఫిన్ తిని, కాఫీ త్రాగి చక్కగా కూర్చున్నది. పైన నేను స్నానము చేస్తున్నాను. ఉన్నట్లుండి ఆమె "స్వామీ, స్వామీ, స్వామీ" అని మూడు పర్యాయములు పిలిచింది. "ఏమి? నేను వస్తున్నాను, వస్తున్నాను" అని చెప్పాను. "త్వరగా రండి, త్వరగా రండి" అన్నది. అప్పుడే నేను తుడుచుకొని క్రిందికి వచ్చాను. నా చేతులు రెండూ గట్టిగా పట్టుకొని ఆమె కన్ను మూసింది. సరే, ప్రాణం ఉన్నంతవరకు తల్లిని దగ్గర పెట్టుకోవాలి, ప్రేమతో చూడాలి. కాని, ప్రాణం పోయిన తరువాత దేహం అక్కడ ఉండనక్కర్లేదు కదా! అసలు ఎవరు తల్లి? ప్రాణమే తల్లి; దేహము కాదు. కాబట్టి, ప్రాణం పోయిన తరువాత ఇంక దేహం ఎందుకు? తక్షణమే కారు తెప్పించాను. కారులో ఆమె దేహాన్ని పెట్టి పుట్టపర్తికి పంపించాను. నేను అక్కడే ఉండి సమ్మర్ క్లాసులను యథాప్రకారం జరిపించాను.

సమ్మర్ కోర్సులో పాల్గొనడానికి ఏదో ఒక్క కాలేజి నుండి కాదు, ఇండియాలో ఉన్న అనేక కాలేజిలనుండి పిల్లలు వచ్చారు. వారందరుకూడా, "ఈనాడు స్వామి క్లాసుకు రారు" అని అనుకున్నారు. కాని, ఏమి జరిగింది? సరిగ్గా తొమ్మిది గంటలకు నేను క్లాసుకు పోయాను; చిరునవ్వు నవ్వుతూ వెళ్ళాను. స్వామి వచ్చారని పిల్లలందరూ ఆశ్చర్యపోయారు. "ఏమిటిది? స్వామి తల్లి పోయింది. స్వామి ఎట్లా వచ్చారు?" అని అనుకొన్నారు. "తల్లి ఎక్కడికీ పోలేదు. 'తల్లి' అని పిలుస్తూ వచ్చిన ఆ దేహం పోయిందికాని తల్లి నా దగ్గరనే ఉంది. కనుక, నేను ఏమాత్రం బాధపడనక్కర్లేదు. మీరుకూడా ఆరీతిగా భావించి సంతోషంగా ఉండండి" అని చెప్పాను. "ఏమిటి? స్వామి ఈవిధంగా చెబుతున్నారే!" అని గోకాక్ కూడా ఆశ్చర్యపడ్డాడు.

**ప్రాపంచికంగా చేయవలసిన సత్కర్మలన్నీ చేయాలిగాని, దేహంతో సంబంధం పెట్టుకోకూడదు**

నేను దేహానికి పుట్టలేదు. దేహం ఎటువంటిది? పంచభూతములు ఉన్నంతవరకే దేహం ఉంటుంది. దేహం ఒక బ్యాగువంటిది. పంచభూతములను ఈ 'బ్యాగు'లో వేసుకొని



sri sathyasai vachanamrutam

వచ్చాము. పంచభూతములు పోతూనే 'ఖాళీ' అయిన ఈ 'బ్యాగు'ను పారవేస్తాము. కనుక, దేహంతో మనం సంబంధం పెట్టుకోకూడదు. ఏ తల్లి అయినా, ఏ కుమారుడయినా ఇదే భావంతో జీవించాలి. ఉన్నంతవరకు తల్లిదండ్రులను గౌరవంగా, మర్యాదగా, ప్రేమగా చూడాలి; వారిని సంతోష పెట్టాలి. అంతేగాని, దేహం పోయిన తరువాత దానిగురించి విచారించనక్కర్లేదు. ఇక్కడ (పుట్టపర్తిలో) కూడను "ఏమిటిది? స్వామి ఈశ్వరమ్మ దేహాన్ని మాత్రమే పంపించారు. దేహం వెంట స్వామి రాలేదే" అని అన్నారు. దేహం వెంట వచ్చి నేనేమి చేసేది?! దేహం కేవలం ఒక ఉపాధి; ఒక తోలుతిత్తి. పంచభూతములు పోతూనే దేహం పోయింది. పంచభూతాలు పంచభూతాలలో చేరిపోయినాయి. దానికి ఎందుకు బాధపడాలి?! కాబట్టి, ప్రాపంచికంగా చేయించవలసిన కర్మలన్నీ ఇక్కడ చేయించాను. నేనక్కడే ఉండి ఆనందంగా సమ్మర్ క్లాసులు జరిపించాను. ప్రపంచంలో మన దేహమునకు గల సంబంధ బాంధవ్యములన్నీ మనము కల్పించుకోవడంవల్లనే ఏర్పడుతున్నాయిగాని, లేకపోతే ఒకరికొకరికి సంబంధ మెక్కడ! దేహాభిమానమువల్లనే 'ఈమె నా తల్లి' అని అంటున్నాము. దేహానికి దేహము తల్లి. కాని, దేహముతో నాకు ఎట్టి సంబంధమూ లేదు. ఆమె వచ్చింది, తన కర్మను ఆచరించి వెళ్ళింది. 'ఇంక నా పని నేను చేయాలి', అని సంకల్పించుకున్నాను. ప్రాపంచిక దృష్టితో చూస్తే, అది పాంచభౌతిక దేహము.

**దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు, గణుతింపగ దేహికి చావు పుట్టుకల్**
**మోహ నిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడ యా**
**దేహియె దేవదేవుడు, మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!**

కనుక, మనము దేహిని చూడాలిగాని, దేహాన్ని చూడకూడదు. ప్రతి మానవుడు నిద్రిస్తూనే దేహాన్ని మరచిపోతాడు. నిద్రలోనే నీవు మరచిపోతున్నప్పుడు దేహాన్ని శాశ్వతంగా ఎందుకు మరువకూడదు? ఐతే, ఉన్నంతవరకుకూడను తల్లి దండ్రులను ఏమాత్రము అలక్ష్యం చేయకూడదు. వారిని మనము పోషించాలి, అన్నివిధాలుగా ప్రేమించాలి, గౌరవించాలి. నీకు వివాహమైన తర్వాత 'ఈమె నా భార్య' అని అంటావు. భార్య ఎక్కడినుండి వచ్చింది?

srisathyasaivahanamrutam

మధ్యలో వచ్చింది. మధ్యలో వచ్చిన భార్యపై వ్యామోహంతో నీవు పుట్టక పూర్వమే ఉన్నటువంటి నీ తల్లిని మరచిపోవడం వెఱ్ఱితనం. కొడుకులుగాని, బిడ్డలుగాని, మనవళ్ళుగాని, అల్లుళ్ళుగాని అందరూ మధ్యలో వచ్చిపోయేవారే! నీవు జీవించి ఉండినప్పుడు మాత్రమే వీరందరితో నీకు 'కనెక్షన్' ఉంటుంది. నీవే లేకపోతే వీరితో 'కనెక్షన్' ఎక్కడిది?! కనుక, మనము దేహాలతో ఏమాత్రం సంబంధం పెట్టుకోకూడదు. భౌతికంగా, ప్రాపంచికంగా తల్లిదండ్రులకు మనము చేయవలసిన సత్కర్మలూ, సదాచారములూ అన్నీ చేయవలసిందేకాని, వారు పోయినప్పుడు మనము ఏమాత్రము విచారించకూడదు.

**"నేనే నీ తల్లిని"**

ఒకానొక సమయంలో నరసింహమూర్తి (బృందావన్ హాస్టల్ వార్డెన్) నాదగ్గరకు వచ్చి, "స్వామీ, మా తల్లి చనిపోయింది" అని అన్నాడు. "ఎవరు పోయినారు? దేహం పోయిందా? తల్లి పోయిందా? తల్లి పోలేదు, ఇక్కడే ఉంది. తల్లియొక్క దేహం పోయింది. దేహములు ఏనాటికైనా పోక తప్పదు. అవి కేవలం నీటిబుడగలే; వస్తుంటాయి, పోతుంటాయి. కనుక, నీవు ఆమెకోసం విచారించ వద్దు. నీకు నేనున్నాను. I am your mother (నేనే నీ తల్లిని). ఆమెవల్ల నీకు ఏమి కావలెనో నన్ను అడుగు, నేనిస్తాను" అని చెప్పాను. అప్పటినుంచి నరసింహమూర్తి నాదగ్గరనే ఉన్నాడు. తనకు కావలసినవన్నీ నన్ను అడుగుతాడు, నేను ఇస్తున్నాను.

**మాతా నాస్తి పితా నాస్తి నాస్తి బంధు సహోదరః**
**అర్థం నాస్తి గృహం నాస్తి తస్మాత్ జాగ్రత జాగ్రత**

తల్లిదండ్రులు, బంధుమిత్రులు వస్తారు, పోతారు, వస్తారు, పోతారు (Coming and going); కాని, God is not coming and going. He is always present (భగవంతుడు రావడమూ లేదు, పోవడమూ లేదు. తాను అన్నివేళలా అన్నిచోట్లా ఉన్నాడు). భగవంతుడు Omnipresent (సర్వవ్యాపి). ఈ జగత్తంతా కదలిపోయేటటువంటిదే. ఈ ప్రపంచంలో ఎంతమంది పుట్టలేదు! వారంతా ఉన్నారా ఇప్పుడు? మరణం ఏరీతిగానైనా



sri sathyasai vachanamrutam

రావచ్చును. మరణమునకు ఒక లక్షణం లేదు. మరణమంటే మరణమే (Death is death). అంతేగాని, దీనికి కొన్ని లక్షణాలుండాలని మనము భావించకూడదు. అయితే, జీవించి ఉన్నంత వరకు తల్లిదండ్రులను మనం అగౌరవపరచకూడదు. నీవలన నీ తల్లి కంటిధారలు కార్చకూడదు. ఆమెను ఎల్లప్పుడు నీవు సంతోషపెడుతూ రావాలి. ఆ సంతోషమే నీకు మంచి ప్రతిఫలాన్నిస్తుంది.

**తల్లిదండ్రులను మరచినవాడు మానవుడే కాదు**

ఇంతకు ముందుకూడా నేను చెప్పాను - నాకు ప్రతి దినమూ కనిపిస్తున్నారు తల్లీ, తండ్రీ ఇద్దరూ. వారు వచ్చి నన్ను చూసి ఆనందిస్తుంటారు, వారిని చూసి నేనూ చిరునవ్వు నవ్వుతాను. చిన్నపిల్లలు మనల్ని చూచినప్పుడు చిరునవ్వు నవ్వుతారు. వారిని చూసినప్పుడు మనకూ ఆనందం కలుగుతుంది. అట్లనే తల్లిదండ్రులు మన బిడ్డలవంటివారు. కనుక, మనము పెద్దవారమయినాము కదా అని వారిని ఏమాత్రం అవమానముగాని, అగౌరవముగాని, హేళనగాని చేయకూడదు. "మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ." తల్లి మనకు దేహాన్నిస్తుంది. తండ్రి మన దేహాన్ని పోషించి జీవితంలో అభివృద్ధికి రావడానికి తగిన అవకాశాలు ఇస్తాడు. గురువు విద్యను బోధిస్తున్నాడు. దైవము సర్వమును అందిస్తున్నాడు. కనుక, మనము ఈ నలుగురినీ మరువకుండా మనస్సులో పెట్టుకోవాలి. తల్లిదండ్రులు నిరంతరము మన హృదయమునందే ఉండాలి. ఎంత కష్టము కలగనీ, వారిని మాత్రము మనము మరువకూడదు. తల్లిదండ్రులను మరచినటువంటివాడు మానవుడే కాదు. తల్లిదండ్రులను మరచితే నీవు లేవు. తల్లిదండ్రులే మనకు ప్రధాన మైనటువంటి అండదండలు. కాబట్టి, వారిని ఆనందింపజేయటానికి ఎంత సాధ్యమో అంత కృషి చేయాలి. ఎంత కష్టమైనా పడి, భిక్షమైనా తెచ్చి వారిని పోషించాలి. వారి మనోభీష్టాన్ని నెరవేర్చాలి. వారి మనోభీష్టాన్ని నెరవేర్చినప్పుడు రేపటి దినము తత్ఫలితమును నీవు అనుభవిస్తావు. ఈనాడు నీవు నీ తల్లిదండ్రులను కష్టపెడితే, రేపటి దినము నీ పిల్లలు నిన్ను కష్టపెడతారు. "రియాక్షన్, రిఫ్లెక్షన్, రీసౌండ్" - ఎవరికైనా ఇవి తప్పేవి కావు.

srisathyasaivachanamrutam

నీ తల్లిదండ్రులు ఎప్పటికినీ నిన్ను మరువరు. నీవుకూడా నీ తల్లిదండ్రులను ఎన్నడూ మరువకూడదు. అందుకోసమనే నేను బృందావనంనుండి నేరుగా ఇక్కడికి వచ్చాను. ముందేదో కొడైకెనాల్‌కి వెళతానని అనుకొన్నారు. కాని, నేను “మే 6వ తేదీ నాటికి ఇక్కడికి రావాలి. వచ్చి మంచిగా ఫంక్షన్ చేయాలి. బీదలకు గుడ్డలు పంచాలి, కడుపు నిండా తిండి పెట్టి వారిని ఆనందపెట్టాలి” అని నిర్ణయించుకొన్నాను. నేను ఎక్కడికి వెళ్ళినప్పటికీ ఇదే చేస్తుంటాను. బీదవాళ్ళనే చులకన భావంతో మనం వాళ్లని నెట్టకూడదు. వారిని మరువకుండా జ్ఞాపకమునందు ఉంచుకోవాలి. కాని, కొంతమంది వారిని దూషిస్తుంటారు, విమర్శిస్తుంటారు. కాని, అది చాలా తప్పు. ఆ విమర్శ తరువాత వాళ్లకే తిరిగి వస్తుంది. బీదలను విమర్శిస్తున్నామని వాళ్లు అనుకొంటారుగాని, నిజానికి తమను తామే విమర్శించుకొంటున్నారు. కాబట్టి, బీదలను మనము ప్రేమించాలి. వారికి తగిన సహాయం చేస్తూ రావాలి. వారిని విమర్శించకూడదు, అగౌరవపరచ కూడదు. పదిమందిలో వారిని అగౌరవపరిస్తే, భవిష్యత్తులో పదిమంది నిన్ను అగౌరవపరుస్తారు.

**ఎవరు చేసిన కర్మ వారనుభవింపక ఎవరికైనను తప్పదన్నా**
**ఏనాడు ఏతీరు ఎవరు చెప్పగలరు అనుభవించుట సిద్ధమన్నా!**
**అలనాటి పాండవులు ఆకులలములు మేసి అడవిపాలైపోయిరన్నా**
**రాముడంతటివాడు రమణి సీతను బాసి పామరునివలె ఏడ్చెనన్నా!**

పాండవులు ఎంతటి బలవంతులు! ఎంతటి శక్తి సామర్థ్యములు గలవారు! అటువంటివారు కూడా ఆకులలములు తింటూ అడవిలో జీవించవలసి వచ్చింది. ఎందుచేత? జూదంలో వారు ఓడిపోయారు. జూదం ఎప్పుడూ మంచిది కాదు. ఈ చెడ్డ మార్గంలో పోయినటువంటివారందరికీ ఇదే గతి పడుతుంది. అట్లే, మద్యపానం కూడా మంచిది కాదు. మద్యపానం చేసినవాడు ఏమేమో మాట్లాడతాడు. సరియైన స్థితికి వచ్చిన తరువాత “అయ్యో, ఈవిధంగా మాట్లాడానే” అని బాధపడతాడు. కోపము, కామము – ఈ రెండూ రాక్షస లక్షణాలు. కాబట్టి, వాటిని మన దగ్గరకుకూడా రానివ్వకూడదు. కోపం వచ్చినప్పుడు ముందు వెనుక ఆలోచించకుండా ఏమేమో అనేస్తాము. తరువాత ‘అయ్యో, నేనీవిధంగా

srisathyasaivachanamrutam

తిట్టానే' అని బాధపడతాము. కనుక, కోపమును మొట్టమొదట చంపుకోవాలి. ఏ స్త్రీలోనైనా, ఏ పురుషునిలోనైనా కోపము, కామము కనిపిస్తే, వాళ్ళను శిక్షించాలి.

**"త్వమేవ మాతాచ పితా త్వమేవ..."**

దైవాన్ని ప్రేమించండి. దైవాన్ని వరించండి. దైవాన్ని ఇష్టపడండి. దైవమే మన తల్లి, దైవమే మన తండ్రి, దైవమే సర్వము. కనుక,

**త్వమేవ మాతాచ పితా త్వమేవ త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ**
**త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ త్వమేవ సర్వం మమ దేవదేవ**

అని ప్రార్థించండి. భగవంతుడే మీ నిజమైన బంధువుగా విశ్వసించండి. భగవంతుడు ఎప్పటికీ మిమ్మల్ని వదలి ఎక్కడికీ పోడు. He is omnipresent (భగవంతుడు సర్వవ్యాపకుడు). ఈ ప్రపంచంలోని బంధువులు, మిత్రులు అందరూ కేవలం కదలిపోయే మేఘాలవంటివారు. They come and go. కాని, దివ్యత్వమనేది మాత్రం comes and grows. కనుక, దైవాన్ని మీరు విశ్వసించండి. ఆవిధమైన దైవప్రేమ గలవాడే నిజమైన మానవుడు.

*(స్వామి, ఇరాన్‌నుంచి వచ్చి శ్రీ సత్యసాయి ప్రైమరీ స్కూల్‌లో చదువుకొంటున్న ఒక పసివాణ్ని పిలిచి అతనిచేత వేదం చెప్పించారు.)*

**వేదమే సర్వవిధములైన వేదనలను తీరుస్తుంది**

వేదములో సమస్తమూ ఉంటున్నది. హిందూ, ఇస్లాం మొదలైన అన్ని మతముల సారము వేదములో ఉన్నది. మతములు వేరైనా దైవం ఒక్కడే. ఒకే దైవాన్ని వేర్వేరు పేర్లతో పిలుస్తున్నాము. వేదము కేవలము హిందువులకు మాత్రమే తప్ప వేరొకరికి లేదని చెప్పకూడదు. వేదము అందరికీ సంబంధించినది. వేదమే సర్వవిధములైన వేదనలను తీరుస్తుంది. కనుక, వేదాన్ని అందరూ నేర్చుకోవడం మంచిది. చాలామంది అమెరికన్స్‌కూడా వచ్చి ఇక్కడ వేదము నేర్చుకొంటున్నారు. రష్యాలో, జర్మనీలో కూడా

sri sathyasai vachanamrutam

వేదాన్ని ప్రొద్దున్న, సాయంకాలము పఠిస్తున్నారు. కాని, హిందువులు మాత్రం దీనిని మరచి పోతున్నారు. వేదాన్ని ఎవ్వరూ మరువకూడదు. వేదము, వేదాంతము తల్లిదండ్రులవంటివి. ఈ ఇద్దరినీ మరువకుండా నిరంతరము స్మరిస్తూ రావాలి.

విద్యార్థులారా! మీరెంత చదువు చదివినా దైవాన్ని మాత్రము ఎప్పటికీ మరువకూడదు. అప్పుడే మీకు తగినటువంటి శాంతి లభిస్తుంది. 'నాకు peace (శాంతి) కావాలి' అని అంటారు. శాంతి ఎలా లభిస్తుంది? "భజన బినా సుఖ శాంతి నహీ." శాంతి కావాలని అనేకమంది యజ్ఞాలు, యాగాలు చేస్తారు. నిజానికి శాంతి మనలోనే ఉంది. అది బయటినుండి వచ్చేది కాదు. బయటి నుండి వచ్చేదంతా pieces, pieces! Peace మన హృదయమునుండే ఆవిర్భవిస్తుంది. శాంతిని పొందాలంటే, భజనలు చేయాలి. భజనద్వారానే శాంతి లభిస్తుంది.

**– తేదీ 06.05.2008, ఈశ్వరమ్మ డే, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vachanamrutam